
# సాక్షి
## అనంతపురం

ఆదివారం । 28 । మే । 2023

**చీనీ టన్ను రూ.36 వేలు**

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.36 వేలు పలికాయి.



**ప్రతిభను వెలికి తీసేందుకే..**

జిల్లా స్థాయిలో యువజనోత్సవాలు శనివారం సందడిగా జరిగాయి. యువతీయువకులు తమ ప్రతిభ చాటుకున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
42.1°/24.9°

జిల్లా అంతటా శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం, ఉక్కపోత అధికంగా ఉంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు చోట్ల తేలికపాటి వర్షం కురిసింది.



## న్యూస్‌రీల్

### రేపటి నుంచి విత్తన వేరుశనగ పంపిణీ



**అనంతపురం అగ్రికల్చర్:** ఈనెల 29న రాయితీ విత్తన వేరుశనగ పంపిణీ ప్రారంభం కానుంది. ఈనేపథ్యంలో ఆర్‌బీకే వేదికగా రైతు రిజిస్ట్రేషన్లు జోరుగా సాగుతున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి (డీఏఓ) బి.చంద్రా నాయక్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతానికి 38 వేల మంది రైతులు 33,600 క్వింటాళ్లకు పేర్లు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. కే-6, కదిరి-లేపాక్షి 1812 రకం వేరుశనగతో పాటు కందులు, పెసలు, కొర్రలు, రాగులకు కూడా రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు తెలిపారు. కాగా శనివారం నాటికి 241 ఆర్‌బీకేల పరిధిలో 18 వేల క్వింటాళ్ల విత్తన వేరుశనగ నిల్వ చేసినట్లు ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ జే ధనలక్ష్మి తెలిపారు. విత్తనశుద్ధి, సరఫరా కార్యక్రమాన్ని వేగవంతం చేశామన్నారు.

### జిల్లాలో బైక్ ర్యాలీలు రేపు

**అనంతపురం క్రైం:** జిల్లాలోని నియోజకవర్గాల్లో ఈనెల 29న బైక్ ర్యాలీ ఉంటుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలు, అమరావతిలో వేల సంఖ్యలో ఇళ్ల పట్టాల పంపిణీ సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహించాలని అధిష్టానం ఆదేశించిందన్నారు. అదేవిధంగా ఈ నెల 30న ప్రభుత్వం ఏర్పాటై నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం, సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

### టీచర్ల బదిలీలకు 7,856 దరఖాస్తులు



దరఖాస్తులు పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు

**రాప్తాడురూరల్:** ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ బదిలీలకు 7,856 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు గడువు శుక్రవారంతో ముగిసింది. అయితే శనివారం మధ్యాహ్నం వరకు వెబ్‌సైట్ అందుబాటులో ఉండడంతో తప్పనిసరి బదిలీ కావాల్సిన పలువురు దరఖాస్తు చేసుకున్నారు. మొత్తమ్మీద పీఎస్‌హెచ్‌ఎం 249, గ్రేడ్-2 హెచ్‌ఎంల నుంచి 268, ఎస్జీటీల నుంచి 3,811, స్కూల్ అసిస్టెంట్లు (లాంగ్వేజెస్) నుంచి 1,304, స్కూల్ అసిస్టెంట్లు (నాన్ లాంగ్వేజెస్) నుంచి 2,079, పీఈటీల నుంచి 29, లాంగ్వేజ్ పండిట్ల నుంచి 115 దరఖాస్తులు అందాయి. వీటిలో ఐదు విద్యా సంవత్సరాలు పూర్తయిన ప్రధానోపాధ్యాయులు, 8 విద్యా సంవత్సరాలు పూర్తయిన టీచర్లు 2,290 మంది దరఖాస్తు చేసుకున్నారు. అలాగే రీ-అపోర్షన్మెంట్ మేరకు సర్‌ప్లస్ అయిన టీచర్ల నుంచి 1706, ప్రిఫరెన్షియల్ కేటగిరీకి సంబంధించి 432, స్పౌజ్ కేటగిరి కింద 1063, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధుల నుంచి 12 దరఖాస్తు చేసుకున్నారు.

**అర్ధరాత్రి దాకా దరఖాస్తుల పరిశీలన..**

ప్రిఫరెన్షియల్, స్పౌజ్ కేటగిరీల కింద వచ్చిన దరఖాస్తులను స్థానిక సైన్స్‌సెంటర్‌లో ఈనెల 25 నుంచి పరిశీలిస్తున్నారు. ధ్రువపత్రాలు, ఎస్ఆర్‌లు పరిశీలించి, ఆమోదం తెలుపుతున్నారు. డిప్యూటీ డీఈఓ, ఎంఈఓల స్థాయిలోనే ఒక సారి పరిశీలించారు. జిల్లా స్థాయిలో మరోమారు పరిశీలిస్తున్నారు. చివరిరోజు (శనివారం) అర్ధరాత్రి దాకా జరిగింది. షెడ్యూల్ ప్రకారం ఆదివారం (నేడు) ప్రొవిజినల్ సీనియార్టీ జాబితా విడుదల చేయాల్సి ఉంది. ఈనెల 30న టీచర్ల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఈనెల 31, జూన్ 1 తేదీల్లో అభ్యంతరాలను పరిశీలించి, పరిష్కరిస్తారు. 2న తుది ఫైనల్ జాబితా వెల్లడించనున్నారు.

# జీఎస్టీ వసూళ్లు అదుర్స్

- ఉమ్మడి అనంతపురం జిల్లాలో భారీగా రాబడులు
- ఒక్క ఆర్థిక సంవత్సరంలోనే సెంట్రల్, స్టేట్ ట్యాక్స్‌ల రూపేణా రూ.6,754 కోట్లు వసూలు
- పరిశ్రమల నుంచి భారీగా వస్తున్నట్లు అధికారుల వెల్లడి
- గతంతో పోలిస్తే 15 శాతానికి పైగా పెరిగిన వసూళ్లు
- పరిశ్రమలు పెరుగుతున్న కొద్దీ పన్ను రాబడుల్లోనూ పురోగతి






**సాక్షి ప్రతినిధి, అనంతపురం:** గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో పన్ను రాబడులు బాగా పెరిగాయి. జీఎస్టీ వసూళ్లలో మంచి ఫలితాలు వచ్చాయి. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి 2022-23 ఆర్థిక సంవత్సరంలో సెంట్రల్, స్టేట్ ట్యాక్స్‌ల రూపేణా రూ.6,754 కోట్ల జీఎస్టీ వసూలైంది. 2021-22 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 15 శాతానికి పైగా అధికంగా వసూలైనట్లు అధికార వర్గాలు తెలిపాయి. రెండు జిల్లాల్లోనూ ఏడు జీఎస్టీ సర్కిళ్లు ఉన్నాయి. వీటి నుంచి ఈ సొమ్ము వసూలైంది. అలాగే మునుపటి ఆర్థిక సంవత్సరం (2021-22)లో జీఎస్టీ రూపేణా సుమారు రూ.5,740 కోట్ల ఆదాయం చేకూరింది.

**ఎంఎస్ఎంఈలు పెరుగుతున్న కొద్దీ..**

ఉమ్మడి జిల్లాలో గడిచిన నాలుగేళ్లుగా సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి పరిశ్రమల ఏర్పాటు గణనీయంగా పెరుగుతోంది. దీనివల్ల పన్నుల రూపేణా వచ్చే రాబడుల మొత్తం కూడా పెరుగుతున్నట్టు తేలింది. ముఖ్యంగా సిమెంట్, కార్లు, స్టీల్, గార్మెంట్ కంపెనీల నుంచి 40 శాతం పైన వసూళ్లు ఉన్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల్లో మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. కొత్త పారిశ్రామిక పాలసీ (2023-27) తీసుకురావడం వల్ల చాలామంది సూక్ష్మ, చిన్న స్థాయి పరిశ్రమలు నెలకొల్పడానికి ముందుకు వస్తున్నారు. దీనివల్ల రానున్న రోజుల్లో పన్నుల రూపేణా వచ్చే రాబడులు మరింతగా పెరిగే అవకాశం ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు.

**జీరో బిజినెస్‌ను అరికడితే మరింత వృద్ధి**

అనంతపురం మునిసిపల్ కార్పొరేషన్‌తో పాటు కొన్ని పెద్ద మునిసిపాలిటీల్లోనూ జీరో బిజినెస్ ఎక్కువగా జరుగుతోంది. దీని కారణంగా ప్రభుత్వానికి తగినంత ఆదాయం రావడం లేదు. కొన్ని స్టీల్, ఎలక్ట్రికల్ షాపులు, హోటళ్లు..ఇతరత్రా దుకాణాల నిర్వాహకులు కనీస పన్నులు కట్టకుండా ఎగ్గొడుతున్నారు. వినియోగదారులకు ఎలాంటి బిల్లులూ ఇవ్వడం లేదు. ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేసి పూర్తి స్థాయిలో వసూళ్లు జరిగితే నెలకు రూ.30 కోట్ల నుంచి రూ.40 కోట్లు అదనంగా వస్తుందని అంచనా వేస్తున్నారు. హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాల నుంచి రాత్రికి రాత్రి సరుకు రావడం, ఇక్కడ అన్‌లోడ్ కావడం, షాపుల్లో బిల్లులు లేకుండా అమ్మడం.. తరచూ జరుగుతున్న తంతు ఇది. దీనిపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

**2022-23 ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి అనంతలో నెలవారీగా జీఎస్టీ వసూళ్లు**

| నెల | వసూలైన మొత్తం (రూ.కోట్లలో) |
|---|---|
| 2022 ఏప్రిల్ | 712.17 |
| 2022 మే | 602.48 |
| 2022 జూన్ | 446.32 |
| 2022 జూలై | 622.07 |
| 2022 ఆగస్టు | 497.71 |
| 2022 సెప్టెంబర్ | 490.39 |
| 2022 అక్టోబర్ | 598.70 |
| 2022 నవంబర్ | 459.61 |
| 2022 డిసెంబర్ | 527.96 |
| 2023 జనవరి | 487.90 |
| 2023 ఫిబ్రవరి | 712.93 |
| 2023 మార్చి | 596.46 |

**పన్ను వసూళ్లు భేష్**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పరిశ్రమల నుంచి పన్ను వసూళ్లు బాగుంటున్నాయి. గతంతో పోలిస్తే 15 శాతం అధికంగా పన్ను వసూలైంది. వచ్చే ఏడాది మరింత పెరిగే అవకాశం ఉంది. సిమెంటు, స్టీల్, కార్ల ఇండస్ట్రీ నుంచి ఎగుమతులు ఎక్కువగా ఉంటున్నాయి. వీటి వల్ల మంచి రాబడులు వస్తున్నాయి.

–నీరజ, జాయింట్ కమిషనర్, జీఎస్టీ

### డాక్టర్ లక్ష్మీకాంతమ్మ సస్పెన్షన్

- ఉత్తర్వులు జారీ చేసిన డీఎంఈ నరసింహం

**అనంతపురం క్రైం:** ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని గైనిక్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీకాంతమ్మపై సస్పెన్షన్ వేటుపడింది. ఈ మేరకు శనివారం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నరసింహం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం మండలం చిగిచెర్ల గ్రామానికి చెందిన కవిత (25) అబార్షన్ తర్వాత మృతిచెందిన విషయం విదితమే. దీనిపై 'సాక్షి'లో వరుసగా ' అనంతలో దారుణం, కదిలిన వైద్యురాలి అక్రమాల డొంక, అన్నీ అబద్ధాలే ' శీర్షికలతో కథనాలు ప్రచురితమయ్యాయి. బాలింత మృతి కేసుపై కలెక్టర్ గౌతమి సమగ్ర విచారణకు ఆదేశించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయి, పీసీపీఎన్‌డీటీ యాక్ట్ జిల్లా అధికారి డాక్టర్ యుగంధర్ లోతుగా విచారణ చేశారు.

**ఇవీ అధికారుల విచారణ నివేదికలు ..**

గతంలో అభిజ్ఞ ఆస్పత్రిలో డాక్టర్ లక్ష్మీకాంతమ్మపై నమోదైన 14 ఫైళ్లు, మెడికల్ టర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ (ఎంటీపీ) చట్టాన్ని అతిక్రమించి 99 అబార్షన్లు చేయడం, ఎలాంటి అనుమతులు తీసుకోకుండా శ్రీనివాస నగర్‌లో రూత్ ఆస్పత్రి నిర్వహణ చేపట్టినట్లు అధికారులు కలెక్టర్‌కు ఇచ్చిన నివేదికలో పేర్కొన్నారు. దీనిపై కలెక్టర్ గౌతమి ఈ నెల 22న సస్పెన్షన్‌కు సిఫార్సు చేశారు. ఆ సిఫార్సుతో పాటు డాక్టర్ లక్ష్మీకాంతమ్మపై ఆరోగ్యశాఖ అధికారులు నమోదు చేసిన ఫైళ్ల ప్రతులను వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవికి పంపారు. సస్పెన్షన్ డీఎంఈ పరిధిలో ఉన్న క్రమంలో ప్రిన్సిపాల్.. కలెక్టర్ సిఫార్సుతో పాటు నివేదికలను డీఎంఈకి పంపడంతో డాక్టర్ లక్ష్మీకాంతమ్మపై సస్పెన్షన్ వేటుపడింది.



# త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోవాలి

- జిల్లా కలెక్టర్ ఎం. గౌతమి

**తాడిపత్రి:** మరో రెండు నెలల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె మండలంలోని సజ్జలదిన్నె గ్రామంలోని జగనన్న కాలనీల్లో ఫేజ్ వన్, ఫేజ్ టూ గృహ నిర్మాణాలను స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. ఆర్డీటీ కాలనీ, యర్రగుంటపల్లి, సజ్జలదిన్నె ఫేజ్ వన్, టూలో ప్రభుత్వం నిర్మించి ఇస్తున్న ఇళ్లు ఎన్ని?.. ఇప్పటి వరకు నిర్మించిన ఇళ్ల తదితర వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారు. సజ్జలదిన్నె లేఅవుట్‌లలో జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో కలియతిరిగారు. హౌసింగ్ ఈఈ సత్యనారాయణ, డీఈ షెక్షావలి మాట్లాడుతూ తాడిపత్రిలో 7.50 ఎకరాల విస్తీర్ణంలో మొత్తం 4 లే అవుట్లు ఉన్నాయని, వీటిని మున్సిపల్ పరిధిలోని లబ్ధిదారులకు కేటాయించినట్లు తెలిపారు.

**అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు నిర్మిస్తాం..**

కలెక్టర్ గౌతమి మాట్లాడుతూ ఇప్పటి వరకూ ఇళ్లు మంజూరై లబ్ధిదారులకు ప్రభుత్వం 3 స్కీంల కింద ఇళ్ల నిర్మాణాలు చేపడుతోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు నిర్మిస్తామన్నారు. అనంతరం పట్టణంలోని పోరాటకాలనీ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నాడు - నేడు పనులను పరిశీలించారు. ఏపీ మోడల్ పాఠశాలకు చేరిన జేవీకే కిట్లను పరిశీలించారు. కార్యక్రమంలో అనంతపురం ఆర్డీఓ మధుసూదన్, తహసీల్దార్ మునివేలు, హౌసింగ్ ఈఈ సత్యనారాయణ, డీఎల్‌డీఓ ఓబుళమ్మ, మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ శేషన్న, ఎంపీడీఓ రంగారావు, మున్సిపల్ డీఈ వెంకట సుబ్బయ్య, ఏఈ తేజ, ఈఓఆర్డీ జిలాన్ బాషా, పబ్లిక్ హెల్త్ ఏఈ రేవంత్, ఎంపీపీ సరస్వతి, వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రాజు పాల్గొన్నారు.



పుట్లూరు మండలం కందికాపుల వద్ద కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

**అమ్మాయిలే అన్ని రంగాల్లో ముందంజ**

**పుట్లూరు:** అన్ని రంగాల్లో అమ్మాయిలు రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.. వారిని చక్కగా చదివించాలని ఉపాధి మహిళా కూలీలకు కలెక్టర్ గౌతమి సూచించారు. శనివారం కందికాపుల సమీపంలో సుబ్బరాయసాగర్ నుంచి పుట్లూరు చెరువు వరకు కాలువలో చేస్తున్న పూడికతీత పనులను కలెక్టర్ పరిశీలించారు. మహిళా కూలీలతో వారి కుటుంబ స్థితిగతులపై కొద్దిసేపు ముచ్చటించారు. పని ప్రదేశంలో మస్టర్లను పరిశీలించి, కూలీల హాజరుశాతంపై ఆరా తీశారు. కూలి డబ్బు సక్రమంగా అందుతోందా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ మధుసూదన్, ఏపీడీ వెంకటరత్నం, తహసీల్దార్ సుమతి, ఎంపీడీఓ యోగానందరెడ్డి, సర్పంచ్ శివరామయ్య పాల్గొన్నారు.

### కదిరి ఏఆర్ఎస్‌కు జాతీయ స్థాయి అవార్డు

**కదిరి:** కదిరి వ్యవసాయ పరిశోధన కేంద్రం (ఏఆర్ఎస్)కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. 2022 సంవత్సరంలో అధిక మొత్తంలో కదిరి వేరుశనగ రకాలు ఉత్పత్తి చేసి దేశంలోని వివిధ రాష్ట్రాలకు అందించినందుకుగాను జాతీయ స్థాయిలో 'ఉత్తమ విత్తన ఉత్పత్తి కేంద్రం' అవార్డు దక్కింది. గుజరాత్ రాష్ట్రంలోని జునాఘడ్‌లోని జాతీయ వేరుశనగ పరిశోధన కేంద్రంలో ఈ నెల 24 నుంచి నాలుగు రోజుల పాటు దేశంలోని వేరుశనగ శాస్త్రవేత్తలతో సమావేశం నిర్వహించారు. ఇందులో శ్రీసత్యసాయి జిల్లా కదిరి వ్యవసాయ పరిశోధన స్థానానికి జాతీయ స్థాయిలో మొదటి బహుమతి లభించింది. ఈ అవార్డును భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా.టీఆర్ శర్మ, జాతీయ డైరెక్టర్ డా.బీరల చేతుల మీదుగా కదిరి ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డా.సంపత్‌కుమార్, శాస్త్రవేత్తలు డా.వేమన, డా.రాజేష్, డా. వెంకటరమణలు అందుకున్నారు. మొదటి బహు మతి రావడం పైవారు 'సాక్షి'తో సంతోషం వెలిబుచ్చారు.

# నేడు సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష

- ఎనిమిది కేంద్రాల్లో పరీక్ష నిర్వహణ
- హాజరుకానున్న 3,213 మంది అభ్యర్థులు

**అనంతపురం అర్బన్:** యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష-2023 ఆదివారం జరగనుంది. ఎనిమిది కేంద్రాల్లో పరీక్ష నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. పరీక్ష రెండు సెషన్లుగా నిర్వహించనున్నారు. ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పేపర్-2 ఉంటుంది. అనంతపురం కేంద్రంగా జరగనున్న ప్రిలిమినరీ పరీక్షకు రాయలసీమ పరిధిలోని అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి 3,213 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలతోపాటు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

**గంట ముందే కేంద్రానికి చేరుకోవాలి**

అభ్యర్థులు పరీక్ష సమయం కంటే ఒక గంట ముందు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, ఇతర ఏ విధమైన ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి ఉండదు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ఆధార్, పాన్, డ్రైవింగ్ లైసెన్స్ ఇలా ఏదేని గుర్తింపు కార్డు తప్పనిసరిగా వెంట తీసుకురావాలి. అభ్యర్థుల సౌలభ్యం కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ పని చేస్తుంది. ఏదైనా సమాచారం లేదా ఫిర్యాదు కోసం 8500292992 నంబర్‌కు ఫోన్ చేయొచ్చు.

కలెక్టర్ గౌతమి మాట్లాడుతూ ఎనిమిది కేంద్రాల్లో జరగనున్న సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు యూపీఎస్సీ నిబంధనల ప్రకారం పటిష్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. ఎనిమిది మంది తనిఖీ అధికారులను నియమించామన్నారు. ఇద్దరు అధికారులు రిజర్వులో ఉంటారన్నారు. పరీక్ష కేంద్రంలో అదే కళాశాల ప్రిన్సిపాల్ సూపర్‌వైజర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. అభ్యర్థులు పరీక్ష సమయానికి కంటే గంట ముందే కేంద్రాల వద్దకు చేరుకోవాలన్నారు.




### 'సూక్ష్మ' లక్ష్యాలు పూర్తి చేయాలి

- ఏపీఎంఐపీ ఓఎస్‌డీ వెంకటేశ్వర్లు

**అనంతపురం అగ్రికల్చర్:** రైతులకు మేలు జరిగేలా సూక్ష్మ సాగు సేద్యం (డ్రిప్, స్ప్రింక్లర్ల) లక్ష్యాలు సకాలంలో పూర్తి చేయాలని ఏపీఎంఐపీ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ) వెంకటేశ్వర్లు ఆదేశించారు. శనివారం స్థానిక ప్రాంతీయ ఉద్యాన శిక్షణ కేంద్రంలో రెండు జిల్లాల ఏపీఎంఐపీ అధికారులు జి.ఫిరోజ్‌ఖాన్, సుదర్శన్, ఉద్యానశాఖ జిల్లా అధికారి బి.రఘునాథరెడ్డితో కలిసి మైక్రో ఇరిగేషన్ ఇంజినీర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ఈ ఏడాది అనంతపురం జిల్లాకు 12,500 హెక్టార్లు, శ్రీసత్యసాయి జిల్లాకు 10 వేల హెక్టార్ల లక్ష్యం నిర్దేశించినట్లు తెలిపారు.

**డ్రిప్ ఇన్‌స్టాలేషన్‌పై అవగాహన అవసరం..**

రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్ల అవసరం ఎక్కువగా ఉన్నందున, రిజిస్ట్రేషన్, ప్రాథమిక, తుది పరిశీలన, బీవోక్యూ, బీఎంసీ, నాన్‌సబ్సిడీ, అడ్మినిస్ట్రేటివ్ మంజూరు, మెటీరియల్ డెలివరీ, ఇన్‌స్టాలేషన్, ట్రయల్‌రన్ తదితర ప్రక్రియలు వేగవంతం చేయాలని ఓఎస్‌డీ ఆదేశించారు. అనంతరం క్షేత్రస్థాయి సందర్శనలో భాగంగా చియ్యేడులో రైతు గంగాధర్‌రెడ్డి దానిమ్మతోటలో ఆన్‌లైన్ డ్రిప్, క్రిష్ణమరెడ్డిపల్లిలో రైతు ఆనందర్‌రెడ్డి మొక్కజొన్న పంటలో ఇన్‌లైన్ డ్రిప్‌ను పరిశీలించారు. డ్రిప్ పరికరాలు, వాల్వ్‌లు ఎలా అమర్చాలి? ..వాటి నిర్వహణ, విడిభాగాల పని తీరు, తదితర వాటిపై ఎంఐ ఇంజనీర్లకు ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు.

## ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై దృష్టి సారించండి : డీఐజీ


సిబ్బందికి సూచనలిస్తున్న డీఐజీ అమ్మిరెడ్డి

**పామిడి:** ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని పామిడి పోలీసులను డీఐజీ అమ్మిరెడ్డి ఆదేశించారు. శనివారం సాయంత్రం పామిడి పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. పోలీసులు ప్రజల్లో ఒక భాగమని, తద్వారా కాఫీ విత్ మెన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలన్నారు. అనంతరం కేసుల పురోగతిపై సీఐ కిరణ్ కుమార్‌రెడ్డితో ఆరా తీశారు.

## అంగన్‌వాడీ అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు

**అనంతపురం సెంట్రల్:** అంగన్‌వాడీ పోస్టులకు అర్హత సాధించిన వారికి నియామక ఉత్తర్వులు అందజేస్తున్నారు. మొత్తం 16 పోస్టులు భర్తీ కాగా, 13 అంగన్‌వాడీ హెల్పర్‌పోస్టులు ఖాళీగా మిగిలాయి. ఎంపికైన వారికి సీడీపీఓలు నియామక ఉత్తర్వులు అందిస్తున్నారు.





# ప్రతిభను వెలికి తీసేందుకే యువజనోత్సవాలు

● ఎంపీ తలారి రంగయ్య


ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎంపీ రంగయ్య

**అనంతపురం కల్చరల్:** యువతలో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను వెలికితీయడమే లక్ష్యంగా యువజనోత్సవాలను నిర్వహిస్తున్నారని ఎంపీ తలారి రంగయ్య అన్నారు. నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ సందడిగా సాగాయి. వివిధ ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో తరలి వచ్చిన యువతీయువకులు తమ ప్రతిభను చాటుకుని మెప్పించారు. స్థానిక ఎస్ఎస్‌బీఎన్ కళాశాల వేదికగా జరిగిన ఈ కార్యక్రమాన్ని ఎంపీ తలారి రంగయ్య, ఎన్‌వైకే సంఘటనా ప్రాంతీయ సంచాలకులు ఎంఎస్ నటరాజ్ ప్రారంభించారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, నెహ్రూ యువ కేంద్ర అధికారులు మణికంఠ, శ్రీనివాసులు, కళాశాల కరస్పాండెంట్ పీఎల్ఎన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రభాకరరాజు ఆత్మీయ అతిథులుగా విచ్చేసి, మాట్లాడారు.

**ఉట్టిపడిన సంస్కృతి :** యువజనోత్సవాల్లో భాగంగా జానపద, శాస్త్రీయ నృత్యాలు, కవితలు, పెయింటింగ్, మొబైల్ ఫొటోగ్రఫీ, వక్తృత్వం తదితర అంశాల్లో నిర్వహించిన పోటీల్లో యువత తమదైన ప్రతిభను చాటారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా డాక్టర్ జీఎల్ఎస్ ప్రసాద్, విష్ణుప్రియ, మహేష్‌బాబు, డాక్టర్ రసూల్, కత్తి విజయ్‌కుమార్ వ్యవహరించారు. సాయంత్రం జరిగిన బహుమతుల ప్రదానోత్సవానికి డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా జిల్లా పరిపాలనా విభాగం సహకారంతో ఏర్పాటు చేసిన పలు స్టాల్స్ ఆకట్టుకున్నాయి. ప్రగతిపథం యూత్ అసోసియేషన్ జీవన్‌కుమార్, సాయిట్రస్ట్ విజయ్‌కుమార్, యువమిత్ర మోహన్‌రెడ్డి, యువజన జాగృతి సొసైటీ వెంకటేష్, సామాజిక సేవా కార్యకర్త కేపీ రాజు కార్యక్రమ సమన్వకర్తలుగా వ్యవహరించారు.

## భారత బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ శిక్షణ శిబిరానికి కిరణ్మయి



**అనంతపురం:** చత్తీస్‌ఘడ్‌లోని రాజ్‌నంద్‌గావ్‌లో ఈ నెల 31 నుంచి జూన్ 6వ తేదీ వరకు నిర్వహించే భారత బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ప్రాబబుల్స్ శిక్షణ శిబిరానికి జిల్లాకు చెందిన జి. కిరణ్మయి ఎంపికైంది. జూన్ 10 నుంచి జోర్డాన్ రాజధాని అమ్మన్‌లో జరిగే అంతర్జాతీయ అండర్ 16 బాలికల ఆసియా చాంపియన్ షిప్ పోటీలకు భారత్ తరపున పాల్గొనే ప్రాబబుల్స్ జట్టులో ఏపీ నుంచి ఐదుగురు ఎంపిక కాగా, వారిలో కిరణ్మయి ఒకరు కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో జి. కిరణ్మయిని జిల్లా చీఫ్ కోచ్ కె.జగన్నాథరెడ్డి, సీనియర్ కోచ్ ఎల్. వెంకటేశులు, జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కేఎం హబీబుల్లా, కార్యదర్శి నరేంద్రచౌదరి అభినందించారు.

## కారు ఢీ కొని వ్యక్తి మృతి


శ్రీనివాసులు (ఫైల్)

**కళ్యాణదుర్గం:** కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గంలోని కోట వీధికి చెందిన బానేపల్లి శ్రీనివాసులు (62) శనివారం ఉదయం వెంకటంపల్లిలోని తన పొలానికి వెళ్లాడు. మధ్యాహ్నం ఎరువుల కోసమని ద్విచక్ర వాహనంపై కళ్యాణదుర్గానికి బయలుదేరాడు. మార్గమధ్యంలోని గోళ్ల ఆంజనేయస్వామి ఆలయం వద్దకు చేరుకోగానే అనంతపురం వైపు నుంచి కళ్యాణదుర్గం వస్తున్న కారు డ్రైవర్ నియంత్రణ కోల్పోయి ఎదురుగా వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొన్నాడు. ఘటనలో రోడ్డుపై పడిన శ్రీనివాసులు తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చి, లొంగిపోయాడు. కాగా, మృతుడికి భార్య ఆదెమ్మ, వివాహమైన ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. ఘటనపై కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ఈడిగ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

**రాప్తాడురూరల్:** జిల్లాలో 2022-23 విద్యా సంవత్సరం పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చాటిన ఈడిగ (గౌడ) విద్యార్థులకు ఈడిగ (గౌడ) ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా అవార్డుల పురస్కారాలు అందజేయనున్నారు. ఈ మేరకు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఈజీ నాగభూషణం, ప్రధానకార్యదర్శి ఆదిశేషయ్య శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 850, ఆపై మార్కులు సాధించిన విద్యార్థులు, 900, ఆపై మార్కులు సాధించిన ప్రైవేటు కళాశాల విద్యార్థులు, పదో తరగతిలో ప్రభుత్వ పాఠశాలల్లో 450, ఆపై మార్కులు, ప్రైవేట్ పాఠశాలల్లో 500, ఆపై మార్కులు సాధించిన విద్యార్థులు అర్హులు. అర్హులైన విద్యార్థులు జూన్ 5వ తేదీలోపు ఆన్‌లైన్ మార్కుల జాబితా, స్టడీ సర్టిఫికెట్, విద్యార్థి ఆధార్ ధ్రువీకరణ పత్రం, ఫోన్ నంబర్‌తో సహా జతచేసిన దరఖాస్తు ఫారంను 94411 44271. 70133 28056 94405 86028 నంబర్లకు వాట్సాప్ ద్వారా పంపాలి. అవార్డులు ప్రదానం చేసే తేదీని ఫోన్ ద్వారా సమాచారం అందిస్తారు.

## వాహన కాలుష్యాన్ని నివారిద్దాం


ప్రతిజ్ఞ చేయిస్తున్న డీటీసీ శివరాంప్రసాద్, అధికారులు

**అనంతపురం సెంట్రల్:** కాలం చెల్లిన వాహనాల వినియోగంతోనే వాతావరణంలో కాలుష్యం పెరుగుతోందని ఉప రవాణా కమిషనర్ (డీటీసీ) శివరాంప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు. వాహన కాలుష్య నివారణకు సమష్టి కృషి అవసరమని పిలుపునిచ్చారు. వాహన కాలుష్యంపై శనివారం అనంతపురంలోని టవర్‌క్లాక్ కూడలిలో ప్రజలను ఆయన చైతన్య పరిచారు. కాలుష్య కారకాలతో మానవాళి మనుగడకే ముప్పు ఏర్పడుతోందన్నారు. వాహనాల సంచారం వల్లనే 70 శాతం కాలుష్యం పెరుగుతోందన్నారు. దీనిని నివారించడాన్ని అందరూ బాధ్యతగా స్వీకరించాలన్నారు. కాలుష్యం వెదజల్లే వాహనాలను నడపరాదని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ వాహనాల ఇంజిన్ కండీషన్ సక్రమంగా ఉండేలా చూసుకోవాలని, రవాణాశాఖ నిబంధనలకు అనుగుణంగా పొల్యూషన్ చెక్ చేయించాలని సూచించారు. 2030 నాటికి వాహన కాలుష్యాన్ని పూర్తిగా నివారించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలక్ట్రిక్ వాహనాలు మాత్రమే రాష్ట్రంలో ఉండేటా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఆర్టీఓ సురేష్‌నాయుడు, ఎంవీఐలు అతికనాజ్, సునీత, శ్రీనివాసులు, ట్రాఫిక్ సీఐ వెంకటేష్‌నాయక్, ఆర్టీఏ సిబ్బంది పాల్గొన్నారు.

## గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి

**అనంతపురం అర్బన్:** గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ ఉంచాలని వైద్యాధికారులను కలెక్టర్ గౌతమి ఆదేశించారు. క్షేత్రస్థాయి సిబ్బంది గృహ సందర్శనకు వెళుతున్నారా.? లేదా? అనేది గమనించాలన్నారు. కుటుంబ డాక్టర్ అమలు తీరు, ఇతర కార్యక్రమాలపై శనివారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో వైద్యాధికారులతో ఆమె సమీక్షించారు. కార్యక్రమాల పనితీరును నివేదిక రూపంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు పంపాలన్నారు. లింగ నిర్ధారణ కమిటీ సమావేశాలను, ప్రధానమంత్రి మాతృత్వ యోజన కార్యక్రమాలను ఎంపీడీఓ, స్వయం ఉపాధి సంఘాలతో ప్రతినెలా 9, 10 తేదీల్లో కచ్చితంగా నిర్వహించాలన్నారు. కంటి వెలుగు కార్యక్రమం కింద నిర్వహిస్తున్న శస్త్ర చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, డీఎంహెచ్ఓ వీరబ్బాయి, వైద్యాధికారులు కృష్ణవేణి, యుగంధర్, డెమో భారతి, పీహెచ్‌సీ వైద్యులు పాల్గొన్నారు.



# హజ్ యాత్రికుల ఆరోగ్యానికి ప్రాధాన్యం

● ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి


హజ్ యాత్రికుడికి వ్యాక్సిన్ వేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి

**అనంతపురం సిటీ:** హజ్ యాత్రకుల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి అన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి హజ్‌కు వెళుతున్న వారి కోసం అనంతపురంలోని పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రభుత్వం ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. హజ్ యాత్రికుల ఆరోగ్యంగా ఉండాలని భావించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు అందజేస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వైఎస్ జగన్ మరో 30 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా కొనసాగాలంటూ హజ్ యాత్రికులు దువా చేశారు. జిల్లా పరిషత్ చైర్మన్ బోయ గిరిజమ్మ, మేయర్ మహమ్మద్ వసీం సలీం, వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఫయాజ్, ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గౌస్, హజ్ కమిటీ సభ్యులు మౌలానా ముస్తక్, ఎండీ రఫీ, చాందినీ మస్జీద్ ట్రస్ట్ అధ్యక్షుడు మునీర్‌సాహెబ్, వక్ఫ్‌బోర్డు కమిటీ సభ్యులు ఖమర్ తాజ్, మదని ఇషాక్, రహంతుల్లా, కో-ఆప్షన్ సభ్యుడు షంషుద్దీన్, మైనార్టీ శాఖ డీడీ రఫీ తదితరులు పాల్గొన్నారు.



# అమరావతిలో ఇళ్ల పట్టాల పంపిణీ చరిత్రాత్మకం

● వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



**అనంతపురం క్రైం:** అమరావతిలో 50,793 మంది అక్క, చెల్లెమ్మలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్ల పట్టాలను పంపిణీ చేసి చరిత్ర సృష్టించారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అన్నారు. తన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతి ప్రాంతంలో చంద్రబాబు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తే.. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అక్కచెల్లెమ్మలకు అండగా నిలిచారన్నారు. ఇప్పటి వరకూ ఏ ప్రభుత్వమూ ఒకే ప్రాంతంలో భారీ సంఖ్యలో ఇళ్ల పట్టాలను పంపిణీ చేసింది లేదన్నారు. ఈ ఖ్యాతి జగన్ సర్కార్‌కే దక్కిందన్నారు. సీఆర్‌డీఏ పరిధిలో రూ.443 కోట్లతో నిర్మించిన 5,024 టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేయడం చరిత్రాత్మకమని కొనియాడారు. ఇళ్ల పట్టాల పంపిణీని అడ్డుకునేందుకు మాజీ సీఎం చంద్రబాబు చేసిన కుట్రలు ఒకట్రెండు కాదన్నారు. రూ.కోట్లు వెచ్చించి నకిలీ ఉద్యమాలు చేయించారన్నారు. సుప్రీం కోర్టును సైతం ఆశ్రయించారన్నారు. అమరావతి ప్రాంతంలో నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తే సామాజిక సమతుల్యం దెబ్బతింటుందని తప్పుడు ప్రచారం చేశారన్నారు. సెంటు స్థలం శవాలు పాతిపెట్టేందుకు కూడా సరిపోదని పేదలను అపహాస్యం చేశారని గుర్తు చేశారు. అయినా సీఎం వైఎస్ జగన్ ఎంతో ఓర్పుతో చంద్రబాబు కుట్రలు తిప్పికొట్టి పేదల పక్షాన నిలిచారన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసిన ఒక్కో ప్లాట్ విలువ రూ.10 లక్షలు అవుతుందని, ఇంతటి విలువైన స్థలాన్ని పేదలకు అందించిన సీఎం వైఎస్ జగన్ మహనీయులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావు పూలే భావజాలాన్ని చాటుకున్నారన్నారు.

# మద్యం తాగి గుడిలోకి వెళ్లొద్దన్నందుకే హత్య

**ధర్మవరం అర్బన్:** మద్యం సేవించి ఆలయంలోకి వెళ్లకూడదని హితవు చెప్పినందుకే పెయింటర్ దారుణంగా హతమయ్యాడని ధర్మవరం వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం, ట్రాఫిక్ సీఐ వహీద్ బాషా తెలిపారు. ఘటనకు సంబంధించిన వివరాలను శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వెల్లడించారు. ధర్మవరంలోని సిద్దయ్యగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం సమీపంలో శుక్రవారం రాత్రి పెయింటర్ సాకే నవీన్‌కుమార్‌ను బండరాళ్లతో మోది దారుణంగా హతమార్చిన విషయం తెలిసిందే. అనంతపురానికి చెందిన సాకే నవీన్‌కుమార్, అతని తమ్ముడు సాయినాథ్ తోపాటు అన్నమయ్య జిల్లా కంబాలపల్లి మండలం కప్పలవారిపల్లికి చెందిన బేల్దారి నిమ్మల రెడ్డిశేఖర్ కొన్ని రోజులుగా ధర్మవరంలో బేల్దారి, పెయింటింగ్ పనులు చేస్తున్నారు. రోజూ సాయంత్రం పని ముగించుకుని ముగ్గురూ కలసి మద్యం సేవించేవారు. శుక్రవారం రాత్రి మద్యం సేవించిన అనంతరం సమీపంలో ఉన్న ఆలయంలోకి నిద్రించేందుకు వెళుతున్న రెడ్డిశేఖర్‌ను నవీన్‌కుమార్ అడ్డుకున్నాడు. మద్యం తాగి ఆలయంలోకి వెళ్లడం తప్పు అని, మరో చోటుకెళ్లి నిద్రిస్తామని పేర్కొన్నాడు. ఈ విషయంగా నవీన్‌కుమార్‌తో రెడ్డిశేఖర్ వాగ్వాదానికి దిగాడు. ఆ సమయంలో పక్కనే ఉన్న బండరాయితో నవీన్‌కుమార్ తలపై పలుమార్లు దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు బృందాలుగా విడిపోయి నిందితుడి కోసం గాలిస్తుండగా గాంధీనగర్ సర్కిల్‌లో శనివారం ఉదయం తచ్చాడుతున్న రెడ్డిశేఖర్‌ను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాలతో రిమాండ్‌కు తరలించారు.

## 532 మంది విద్యార్థుల గైర్హాజరు

**రాప్తాడురూరల్:** ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా గురువారం జరిగిన గణితం-1బీ, జువాలజీ-1, హిస్టరీ-1, గణితం-2బీ, జువాలజీ-2, హిస్టరీ-2 పరీక్షలకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో 532 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సరం పరీక్షకు 13,486 మంది విద్యార్థులకు గాను 13,090 మంది, మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షకు 4,324 మందికి గాను 4,188 మంది విద్యార్థులు హాజరయ్యారు.

## రేషన్ బియ్యం పట్టివేత

**ఉరవకొండ:** అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని విజిలెన్స్ అధికారులు సీజ్ చేసి, బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. శనివారం ఉదయం ఉరవకొండలోని మల్లేశ్వర థియేటర్ వెనుక మార్గం నుంచి బొలెరో వాహనంలో బియ్యాన్ని తరలిస్తుండగా విజిలెన్స్ ఎస్ఐ జైపాల్‌రెడ్డి, సిబ్బంది అక్కడకు చేరుకుని అడ్డుకున్నారు. వాహనంలో 39.61 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించి, వాహనాన్ని సీజ్ చేశారు. బియ్యం తరలిస్తున్న ఉరవకొండకు చెందిన రవి, తిప్పేరుద్రను పోలీసులకు అప్పగించారు.

## వేసవి దుక్కులతో అధిక లాభాలు

● కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ రాధకుమారి

వేసవి దుక్కులు చేస్తున్న దృశ్యం


**కళ్యాణదుర్గం:** రుతుపవనాల ఆరంభానికి ముందే భూమిని లోతుగా దుక్కి చేసుకుంటే పంటల సాగులో అధిక దిగుబడులు సాధ్యమవుతాయని రైతులకు కేవీకే కో-ఆర్డినేటర్ డాక్టర్ రాధాకుమారి సూచించారు. వేసవి దుక్కులపై రైతులకు శనివారం ఆమె పలు సూచనలు చేశారు. సస్య రక్షణలో వేసవి దుక్కులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. లోతుగా దుక్కి చేయడం వల్ల తొలకరి వర్షాలు పడగానే పెళ్లలు మెత్త బడి భూమి లోపలి పొరల్లో నీరు నిక్షిప్త సామర్థ్యం పెరుగుతుందన్నారు. ఫలితంగా విత్తన మొలక శాతం బాగుంటుందన్నారు. వాలుకు అడ్డంగా దుక్కులు చేయడం వల్ల నీటి ప్రవాహం వృథా కాకుండా భూమిలో కలుస్తుందన్నారు. కలుపు మొక్కలు, వాటి అవశేషాలు, పంటలకు హాని కలిగించే వివిధ రకాల పురుగు లార్వాలు నశిస్తాయన్నారు.

## క్లుప్తంగా

### శతక రచన పోటీల్లో ప్రతిభ



ప్రథమ బహుమతి అందుకుంటున్న వెంకట రమణ ప్రసాద్

**అనంతపురం కల్చరల్:** సీపీ బ్రౌన్ సేవా సమితి వారు ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారికి శతక రచన పోటీలు నిర్వహించగా అనంత కవి, అష్టావధాని డాక్టర్ అమ్మల్లదిన్నె వెంకటరమణ ప్రసాద్ ప్రథమ బహుమతి అందుకున్నారు. శనివారం బెంగళూరులో వైభవంగా జరిగిన జయంతి వేడుకల్లో ఆయనకు రూ.15 వేల నగదు బహుమతి అందజేసి, సత్కరించారు. అనంత సాహితీలోకంలో పద్య రచనకు అమ్మల్లదిన్నె చేస్తున్న సేవలను నిర్వాహకులు ఇడమకంటి లక్ష్మీరెడ్డి కొనియాడారు. వివిధ రాష్ట్రాలకు చెందిన 13 మంది రచనలు ఎంపిక చేయగా అనంత వాసి ప్రతిభాశైలి అద్భుతంగా ఉందని ఎన్టీఆర్‌కు సాహితీ నీరాజనాలర్పించారన్నారు.

### మత సామరస్యానికి ప్రతీక ఉరుసు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**అనంతపురం సిటీ:** ఉరుసును మత సామరస్యానికి ప్రతీకంగా అభివర్ణించారు జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్. బొమ్మనహాళ్ మండలం కల్లుహోళ్ల గ్రామంలో వెలసిన హజరత్ సయ్యద్ సహాబాబ్ దీవాన్ మలాంగ్ దీవాన్ మదార్(ర.అ) అవులియా అల్లాహ్ ఉరుసు జూన్ నెల 5 నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో దర్గా కమిటీ రూపొందించిన పోస్టర్లను అనంతపురంలో వక్ఫ్ బోర్డ్ చైర్మన్ రిజ్వాన్ శనివారం ఆవిష్కరించారు. తొలి రోజు గంధంతో మొదలై 7న ఉరుసే షరీఫ్‌తో ముగుస్తుందన్నారు. ఉమ్మడి జిల్లాతో పాటు పొరుగునున్న కర్నూలు, కర్ణాటక ప్రాంతాల నుంచి కూడా భారీగా భక్తులు తరలివస్తారన్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు కూడా పూర్తయ్యాయని వివరించారు.

### నెహ్రూ అడుగు జాడల్లో నడవాలి



నెహ్రూ విగ్రహానికి నివాళులర్పించిన దృశ్యం

**అనంతపురం:** భారతదేశ మొట్టమొదటి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని జేఎన్‌టీయూ అనంతపురం రెక్టార్ ప్రొఫెసర్ ఎం.విజయకుమార్ అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురంలో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి నిర్వహించారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం రెక్టార్ మాట్లాడుతూ.. సాంకేతిక రంగం అభివృద్ధి చెందితేనే దేశం పురోగతి సాధ్యమని భావించి ఆయన అప్పటి నుంచే సంస్కరణలకు బీజం వేశారని పేర్కొన్నారు. ఆయన విశిష్ట వ్యక్తిత్వం, సమయపాలన, ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని కోరారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ అనంతపురం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. సుజాత, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ. కేశవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయండి

- అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్



సనపలో గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

**ఆత్మకూరు:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని లబ్ధిదారులకు అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ సూచించారు. ఆత్మకూరు మండలం సనప గ్రామంలో చేపట్టిన గృహ నిర్మాణాలను శనివారం ఆయన పరిశీలించారు. పనులకు సంబంధించి బిల్లులు ఎప్పటికప్పుడు ప్రభుత్వం అందజేస్తుందని, ప్రతి ఒక్కరూ నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. అనంతరం గ్రామంలోని సచివాలయాన్ని తనిఖీ చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఉద్యోగులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ్‌ప్రసాద్, ఈఓఆర్డీ సత్యబాబు, హౌసింగ్ ఏఈ శ్రీధర్, పంచాయతీ సెక్రటరీ కీర్తన తదితరులు పాల్గొన్నారు.

## నగరం.. హరితవనం



అధికారుల క్వార్టర్స్ పరిసరాల్లో పచ్చగా కళకళలాడుతున్న చెట్లు

అనంతపురం హరిత నగరంగా రూపుదిద్దుకుంది. పల్లె నుంచి నగరానికి వచ్చే జనానికి చల్లని అనుభూతిని అందిస్తోంది. నగరానికి ఎదురుగా ఉన్న దేవరకొండపై చూసినా.. నగరం నడిబొడ్డున ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి చూసినా.. భవంతుల పైనుంచి చూసినా .. ఎటుచూసినా పచ్చని హారంలా కనిపిస్తోంది. ఆస్పత్రి ఆవరణలోనైనా.. రహదారుల్లో నడుస్తున్నా.. పార్కులకెళ్లినా.. ఏ వీధిలో నడుస్తున్నా.. అందంగా, హాయిగా అ(క)నిపిస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



చెరువు కట్టపై ఉన్న చెట్ల కింద సేదతీరుతున్న జనం



టవర్‌క్లాక్ ఫ్లైఓవర్ పక్కన పరచుకున్న పచ్చదనం



సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి రోడ్డులో కనువిందు చేస్తున్న చెట్లు

## పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం

- 2కే రన్‌ను ప్రారంభించిన డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య



2కే రన్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య

**అనంతపురం క్రైం:** హానికర ప్లాస్టిక్‌కు స్వస్తి చెప్పి, మొక్కలను సంరక్షించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్యలు పేర్కొన్నారు. పర్యావరణహిత జీవనశైలిపై ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, గ్రామ, వార్డు సచివాలయ విభాగాలు సంయుక్తంగా శనివారం నిర్వహించిన 2కే రన్ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. నగరపాలక సంస్థ నుంచి టవర్‌క్లాక్ అక్కడి నుంచి తిరిగి నగరపాలక సంస్థ వరకూ సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తు తరాల కోసం ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు. ముఖ్యంగా యువత ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్‌కు బదులుగా జౌళి సంచులను వినియోగించాలన్నారు. కమిషనర్ రమణారెడ్డి మాట్లాడుతూ.. సమస్త జీవవాళి మనుగడకు అవసరమైన పర్యావరణాన్ని పరిరక్షించుకుని, రాబోయే తరలాకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలను ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాటించాలన్నారు. దైనందిన అలవాట్లలో చిన్న చిన్న మార్పులతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగంపై నియంత్రణ, జౌళి సంచుల వాడకం, విద్యుత్ ఆదా, సోలార్ వస్తువుల వినియోగం, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం, కాలుష్య ఉద్గారాల నియంత్రణ, తక్కువ దూరాలకు సైక్లింగ్ ఎలివేటర్‌కు బదులుగా మెట్లను వాడటం వంటి చర్యలతో మార్పు కోసం ప్రయత్నించాలన్నారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శంకర్ రావు, డీఈ రాంప్రసాద్‌రెడ్డి, ఏసీపీ సువర్ణ, టీపీఓ మహబూబ్‌జాన్, టీపీఎస్ దుర్గాంజలి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రకాష్ రోడ్డులో చోరీ

- నాలుగు తులాల బంగారు నగల అపహరణ

**అనంతపురం శ్రీకంఠంసర్కిల్:** స్థానిక ప్రకాష్ రోడ్డులోని ఓ ఇంట్లో దొంగలు పడ్డారు. ఇంట్లోని బీరువాలో దాచిన నాలుగు తులాల బంగారు నగలను అపహరించుకుపోయారు. శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో వెలుగు చూసిన ఘటనపై స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక హెచ్‌ఎల్‌సీ కార్యాలయంలో పని చేసే మూర్తి దంపతులు ప్రకాష్ రోడ్డులో నివాసం ఉంటున్నారు. రోజూ సాయంత్రం 4 గంటలకు మూర్తి భార్య వాకింగ్ కోసం పీటీసీకి వెళ్తుంది. అందులో భాగంగానే ఆమె పీటీసీ బయలుదేరే ముందు ఇంట్లోని ప్రధాన గేటుకు తాళం వేసి తాళాలను రోజువారి దాచే చోట ఉంచి వెళ్లింది. ఆ తాళాలు భర్త కార్యాలయం నుంచి వచ్చి తీసుకుంటాడు. రోజు మాదిరిగానే శనివారం సాయంత్రం కార్యాలయం నుంచి ఇంటికి వచ్చిన భర్త తాళాలు తీసుకుని ఇంటిలోకి వెళ్లి చూస్తే బీరువాలోని వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. దీన్ని గమనించిన భర్త వెంటనే భార్యకు ఫోన్ చేసి ఇంటికి రమ్మని పిలిచాడు. బీరువా మొత్తం పరిశీలించగా అందులో దాచిన నాలుగు తులాల బంగారు నగలు కనిపించలేదు. దీంతో ఇంటి గురించి బాగా తెలిసిన వారే ఈ చోరీ చేశారని గుర్తించారు. విషయం అనంతపురం టూటౌన్ పోలీసులకు చేరవేశారు. కాగా ఇంటి తలుపులకు తాళం వేయకుండా వాకింగ్ వెళ్లడాన్ని చాలాకాలంగా ఎవరో గుర్తించి ఈ పని చేశారని దంపతులు వాపోతున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీశారు.

**రజక నగర్‌లో చోరీపై అనుమానాలు..**

స్థానిక త్రీటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని రజక్ నగరులో చోరీ జరిగిందని ఓ మహిళ పోలీసులను ఆశ్రయించింది. కాగా ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు త్రీటౌన్ సీఐ కత్తి శ్రీనివాసులు బాధిత కుటుంబ సభ్యులను పిలిపించి ఫిర్యాదు చేస్తే దర్యాప్తు చేస్తామని చెప్పారు. కాగా బాధిత కుటుంబ సభ్యులు కొంత సమయం కావాలని కోరారు. ఇదిలా ఉండగా చోరీపై సీఐ కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ.. రజక నగర్‌లో ఓ ఇంట్లో చోరీ జరిగిందని చెప్పారు. ఘటనా స్థలాన్ని పరిశీలించాం. ఐదు రోజులుగా ఇళ్లంతా బంధువులతో సందడిగా ఉంది. అయినా బీరువాలో దాచిన బంగారు నగలు కనిపించలేదు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు మొదట 5 తులాలు బంగారు నగలు కనిపించడం లేదని చెప్పారు. తీరా ఫిర్యాదు చేయమంటే ఆలోచిస్తున్నామన్నారు. దీంతో గడువు కావాలని కోరుతున్నారు. ఇంట్లో మొత్తం వారి బంధువులే ఉండటంతో ఎవరినీ అనుమానించలేని పరిస్థితుల్లో ఉన్నారని తెలిపారు.

### ఘనంగా అక్కమ్మగార్ల జాతర

**రామగిరి:** మండలంలోని కొత్తగ్యాదికుంట సమీపంలో అక్కమ్మగార్ల జాతర ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయాన్నే గ్రామదేవత అక్కమ్మగార్లను గ్రామంలో ఊరేగించారు. అనంతరం మహిళలు బోనాలు మోసుకుని అమ్మవారికి సమర్పించారు. ప్రతి మూడేళ్లకోసారి జరిగే ఈ వేడుకలకు ఆ గ్రామస్తులతోపాటు, రామగిరి, కనగానపల్లి మండలవాసులు హాజరయ్యారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ జనార్దన్‌నాయుడు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

## సర్వజనాస్పత్రిలో కూలీ మృతి

- సకాలంలో క్రిటికల్ కేర్‌కు పంపకుండా వైద్యుల నిర్లక్ష్యం!
- ఘటనపై విచారణ చేపడతామన్న డిప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ పద్మజ



ఎమర్జెన్సీ వార్డులో మృతి చెందిన నాగరాజు

**అనంతపురం క్రైం:** ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని ఎమర్జెన్సీ వార్డులో ఓ కూలీ మృతి చెందాడు. సకాలంలో క్రిటికల్ కేర్ యూనిట్‌కు తరలించకుండా వైద్యులు ఉదాసీనంగా వ్యవహరించడమే ఇందుకు కారణంగా ఆరోపణలు వెల్లువెత్తాయి. మృతుడి భార్య శ్రావణి, తల్లి నరసమ్మ తెలిపిన మేరకు... శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత తీవ్ర ఆయాసంతో బాధపడుతున్న శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి (సీకేపల్లి) మండలం ముష్టికోవెల గ్రామానికి చెందిన వై.నాగరాజు(35)ను ఇంటి పక్కనే ఉన్న నరేష్ సాయంతో ఆటోలో సీకే పల్లిలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి వైద్యుల సూచన మేరకు ఆగమేఘాలపై అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. శనివారం తెల్లవారుజాము 5 గంటలకు ఎమర్జెన్సీ వార్డుకు చేరుకున్నారు. ఊపిరి తీసుకునేందుకు ఇబ్బంది పడుతున్న రోగి శాచురేషన్, పల్స్ తక్కువగా ఉంటే నిబంధనల మేరకు వెంటనే అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్(ఏఎంసీ)కి తరలించి వైద్య సేవలందించాలి. అయితే నాగరాజు విషయంలో అలా జరగలేదనే ఆరోపణలున్నాయి. గంటల తరబడి ఎమర్జెన్సీ వార్డులోనే ఉంచేయడంతో పరిస్థితి విషమించి ఆయన మృతి చెందాడు. కాగా, కేసు షీట్‌లో ఉదయం 6.24 గంటలకు అడ్మిట్ కాగా, 9.45 గంటలకు మృతి చెందినట్లు నమోదైంది. కాగా, శాచురేషన్ తక్కువ, సమస్యాత్మకంగా ఉన్న కేసును ఏఎంసీకి ఎందుకు షిఫ్ట్ చేయలేదని క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్ రామాంజినేయులను అసిస్టెంట్ ఆర్‌ఎంఓ డాక్టర్ సునీత ప్రశ్నించినట్లు తెలిసింది. దీనిపై ఆయన సమాధానమివ్వకపోవడంతో కేసు వివాదాస్పదమైతే మీరే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించినట్లు సమాచారం. ఘటనపై విచారణ చేపట్టనున్నట్లు డిప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ పద్మజ పేర్కొన్నారు.

### మహానాడు పేరుతో బాబు మోసం

- ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల



**అనంతపురం సెంట్రల్:** మహానాడు పేరుతో రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేసేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల మండిపడ్డారు. ఆర్టీటీసీ డిపోలోని తన చాంబర్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. మంచి చేసే వాళ్లను చూస్తే జీర్ణించుకోలేని జబ్బు చంద్రబాబుకు ఉందన్నారు. ఇందుకు అమరావతిలో ఇళ్లపట్టాల పంపిణీని కోర్టుకెళ్లి అడ్డుకోవడమే నిదర్శనమన్నారు. చంద్రబాబును ప్రజలే కాదు.. చివరకు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలూ నమ్మే పరిస్థితి లేదన్నారు. మహానాడుకు పలువురు దూరమయ్యే పరిస్థితి ఉందని, దీంతో పార్టీ కార్యకర్తల తరలింపులకు ఆర్టీసీ బస్సులు కేటాయించడం లేదంటూ అవాస్తవాలతో ప్రజలు తప్పు దోవ పట్టించాలని చూస్తున్నారన్నారు. సంస్థ నిబంధనలు పాటిస్తే ఎవరికైనా అద్దెకు బస్సులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఉనికి కాపాడుకునేందుకు ప్రభుత్వంపై చవకబారు విమర్శలు చేస్తే సహించబోమన్నారు. విశ్వసనీయతకు మారుపేరు వైఎస్ కుటుంబమని, మరోమారు ప్రజలు సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

### విధుల్లోకి నర్సులు

**అనంతపురం క్రైం:** పరస్పర బదిలీల్లో భాగంగా ఆరుగురు హెడ్ నర్సులు, నలుగురు స్టాఫ్‌నర్సులు కర్నూలు పెద్దాస్పత్రి నుంచి అనంతపురం సర్వజనాస్పత్రికి బదిలీపై వచ్చారు. వీరు శనివారం విధుల్లో చేరారు. సొంత జిల్లాకు రావడంతో నర్సుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. అలాగే ఇక్కడి నుంచి ఐదుగురు హెడ్‌నర్సులు, పలువురు స్టాఫ్‌నర్సులు రిలీవ్ అయ్యారు. వీరు కర్నూలు పెద్దాస్పత్రికి వెళ్లనున్నారు.

### ఫార్మసిస్టుల పరస్పర బదిలీలు

**అనంతపురం క్రైం:** ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో కొందరు ఫార్మసిస్టులకు పరస్పర బదిలీలు జరిగాయి. ఈ మేరకు కడప ఆర్‌డీ కేవీఎన్ఎస్ అనిల్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఫార్మసిస్టు నసీమ భాను ఆత్మకూరు పీహెచ్‌సీకి, అక్కడ పని చేస్తున్న నరేంద్రప్రసాద్ జీజీహెచ్‌కు, వేణుగోపాల్ కూడేరు పీహెచ్‌సీకి, అక్కడ పని చేస్తున్న కుళ్లాయిబాబు జీజీహెచ్‌కు, పీ రాజేంద్రబాబు నార్పల పీహెచ్‌సీకి బదిలీ కాగా అక్కడ పని చేస్తున్న ఎస్ కృష్ణవేణి జీజీహెచ్‌కు, కే వెంకటరామ మూర్తి రాప్తాడు పీహెచ్‌సీకి, అక్కడ పని చేస్తున్న సీ రమణశ్రీ జీజీహెచ్‌కు బదిలీ అయ్యారు.

### దత్తతకు చిన్నారి

**అనంతపురం సెంట్రల్:** జిల్లా ఐసీడీఎస్ పరిధిలోని శిశుగృహలో ఆశ్రయం పొందుతున్న రెండేళ్ల చిన్నారిని దత్తత ఇచ్చేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఈ మేరకు ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. చిన్నారి ఆర్నాకు సంబంధించిన వారు ఎవరైనా ఉంటే వెంటనే ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలి. గడువు లోపు ఎవరూ ముందుకు రాకపోతే 30 రోజుల తర్వాత ప్రభుత్వ నిబంధల మేరకు చిన్నారిని దత్తత ఇవ్వనున్నారు.

### నేడు రాయలసీమ మహాకవి సమ్మేళనం

**అనంతపురం కల్చరల్:** రాయలసీమ సాంస్కృతికోద్యమంలో భాగంగా 'సీమ సమస్యలు–భవితవ్యం' అనే అంశంపై ఆదివారం మహాకవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీత డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి తెలిపారు. అంతర్జాలం ద్వారా ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి వేదికపై వివిధ ప్రాంతాల నుంచి 52 మంది కవులు కవితాగానం చేస్తారన్నారు. రాయలసీమ సాంస్కృతిక వేదిక, వేమన అధ్యయన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో జరిగే కవి సమ్మేళనంలో పాల్గొనేందుకు ఆసక్తి గలవారు జూమ్ లింక్ తదితర వివరాల కోసం 9962544299 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

### అనంత వేదికగా 'మానవతా' సేవలు

**అనంతపురం కల్చరల్:** రెండు తెలుగు రాష్ట్రాల్లోని 13 జిల్లాలు, 95 మండలాల్లో విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న 'మానవత' సంస్థ అనంత వేదికగా ప్రారంభం కానుంది. పర్యావరణ పరిరక్షణ, రక్తదానం, నైతిక విలువల బోధన, ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ, పేద విద్యార్థులకు ప్రోత్సాహకాలు, శాంతి రథాలు, ఉచిత మార్చురీ ఫ్రీజర్లు తదితర అంశాల్లో సేవలందించడానికి జిల్లాలోనూ తమ కార్యక్రమాలను రూపొందించడానికి ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక కృష్ణకళా మందిరంలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి రఘునాథ్ తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలకు కార్పొరేట్ హంగులు

- నగరంలో రూ.10 కోట్లతో బడుల అభివృద్ధి
- మేయర్ వసీం



26వ డివిజన్‌లోని అంబేడ్కర్ పాఠశాలలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం

**అనంతపురం క్రైం:** 'సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యా రంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు కార్పొరేట్ హంగులను తీసుకువచ్చారని' మేయర్ వసీం పేర్కొన్నారు. శనివారం నగరంలోని 26వ డివిజన్ పరిధిలోని ఫేస్–2 కింద నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా అంబేడ్కర్ పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల పురోగతిని అడిగి సంబంధిత అధికారులతో అడిగి తెలుసుకున్నారు. నాణ్యతలో రాజీపడకుండా పనులు చేపట్టాలని ఇంజినీర్లను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాడు–నేడు కార్యక్రమంలో రెండవ దశలో నగరంలోని 33 పాఠశాలల్లో రూ.10 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధిని విస్మరిస్తే తమ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పాఠశాలల రూపురేఖలు మార్చేయడం జరిగిందన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు తీసిపోకుండా మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల వైపు పేద, సామాన్య మధ్య తరగతి ప్రజలు ఆకర్షితులవుతున్నారన్నారు. విద్యా రంగంలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులతో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మీనాక్షమ్మ, అనిల్‌కుమార్ రెడ్డి, సంపంగి రామాంజినేయులు, డీఈ చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలి

- బ్లాక్‌స్పాట్ ప్రాంతాల్లో పోలీసుల సంఖ్య పెంచాలి
- జాయింట్ కమిటీ సమావేశంలో కమిషనర్ రమణారెడ్డి, డీఎస్పీ ప్రసాదరెడ్డి నిర్ణయం



అధికారులతో సమావేశమైన కమిషనర్ రమణారెడ్డి, చిత్రంలో డీఎస్పీ ప్రసాదరెడ్డి

**అనంతపురం క్రైం:** నగరంలో రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి, డీఎస్పీ ప్రసాదరెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరపాలక సంస్థలో పోలీసు, రోడ్డు భవనాల, నేషనల్ హైవే, ఆర్టీసీ, నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారులతో కమిషనర్ జాయింట్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. డీఎస్పీ ప్రసాద రెడ్డి, తదితర అధికారులతో కమిషనర్ ప్రమాదాలు, ట్రాఫిక్ జామ్ కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సుదీర్ఘంగా చర్చించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రమాదాలు చోటు చేసుకున్న బ్లాక్ స్పాట్ ప్రాంతాలు, ఆర్టీసీ బస్టాండ్ వద్ద బస్సులు బయటకు వచ్చే ప్రాంతం, రాంనగర్ ఫ్లైఓవర్, పవిత్ర హైపర్ మార్ట్ కూడలి వద్ద ట్రాఫిక్ పోలీసుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ పేర్కొన్నారు. శని, ఆదివారాల్లో మార్కెట్ యార్డు వద్ద ట్రాఫిక్ జామ్ కాకుండా పోలీసులను నియమించాలన్నారు. తోపుడుబండ్లు, వీధి వ్యాపారుల కోసం జోన్స్ గుర్తించి వారిని ఆయా ప్రాంతాల్లోనే విక్రయాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లపై ఆవులు సంచరించకుండా యజమానులకు నోటీసులు జారీ చేసి, వారిలో మార్పు రాకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. ఫుట్‌పాత్ ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపడానికి ప్రజలు సామాజిక స్పృహతో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో ఆర్టీసీ డిపో మేనేజర్ నాగభూపాల్, నేషనల్ హైవే డీఈ జగదీశ్‌గుప్తా, రోడ్లు భవనాల డీఈ బాలకటయ్య, ట్రాఫిక్ సీఐ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

**5వేల మందిని సంఘాల్లో చేర్చాలి**

నగరంలోని వివిధ ప్రాంతాల్లోని 5 వేల మంది మహిళలు స్వయం సహాయక సంఘాల్లో లేరని, తక్షణం వారిని సంఘాల్లో చేర్పించి ఆర్థిక ప్రగతి సాధించేలా సహకరించాలని మెప్మా సిబ్బందిని కమిషనర్ రమణారెడ్డి ఆదేశించారు. శనివారం నగరపాలక సంస్థలో మెప్మా సిబ్బందితో కమిషనర్ సమావేశం నిర్వహించారు. జగనన్న లే అవుట్‌లలో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుని శ్లాబ్, లింటల్ లెవెల్‌కు చేరిన వారితో రూ.35,000 (ఒక్కొక్కరితో) చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ప్రక్రియను పది రోజుల్లో పూర్తి చేయాలని లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ సావిత్రి, మెప్మా ఏఓ హంజద్ హుస్సేన్, పాల్గొన్నారు.

### రేపు బైక్ ర్యాలీ

**అనంతపురం క్రైం:** సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు తీసుకుని నాలుగేళ్లు పూర్తికావడం, పేద కుటుంబాలు తలెత్తుకుని జీవించేలా అందరికీ ఇళ్లు అందించిన సందర్భంగా సోమవారం ఉదయం 9 గంటలకు నగరంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. సోమవారం ఉదయం 9 గంటలకు బళ్లారి బైపాస్ ఎంజీ పెట్రోల్ బంకు నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమై, టవర్‌క్లాక్ మీదుగా సప్తగిరి సర్కిల్, ఐరన్ బ్రిడ్జ్, పాతూరు కూరగాయల మార్కెట్, గాంధీబజార్, శ్రీకంఠం సర్కిల్, రైల్వే ఫీడర్ రోడ్డు మీదుగా ఆర్ట్స్ కళాశాల వరకు సాగనుందని తెలిపారు. అదేవిధంగా ఈ నెల 30వ తేదీన సేవా కార్యక్రమాలు, కేక్ కటింగ్ ఉంటాయని తెలిపారు. బైక్ ర్యాలీ, సేవా కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు.